సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



ఎంత పని చేశావ్..అమ్మా!

కుమార్తెను చంకనెత్తుకున్న ఆ తల్లి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. ప్రొద్దుటూరులో జరిగిన ఈ ఘటనలో నెలలపాప మృతిచెందింది. -8లో..



ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఓబులవారిపల్లె మండలం గాదెల అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 268 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	536	665
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 250.50 కిలోలు

టమాట.. ఇక లాభాల బాట

- మార్కెట్లో ధరలు తగ్గినప్పటికీ కనీస గిట్టుబాటు ధర
- ప్రయోగాత్మకంగా నిమ్మనపల్లె, మదనపల్లెలలో ప్రాసెసింగ్ పంట సాగు
- రైతుకు ఊరటనిచ్చేలా సీడ్ వెరైటీకి ప్రభుత్వ ప్రోత్సాహకం
- సబ్సిడీపై నారు, మల్చింగ్ పేపర్, ప్లాస్టిక్ క్రేట్స్



మదనపల్లె మండలంలో సాగులో ఉన్న టమాటా పంట

జిల్లాలో టమాటా పంట వివరాలు

సాధారణ సాగు 12,500 ఎకరాలు

ప్రస్తుత సాగు 3,950 ఎకరాలు

సీజన్: ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 12 వరకు

ప్రాసెసింగ్‌రకాలకు ప్రభుత్వ సబ్సిడీ: రూ.21,400

మదనపల్లె : టమాటా పంటను రైతులు లాటరీ పంటగా పిలుస్తుంటారు. ఒక సీజన్‌లో ధర ఆకాశాన్నంటితే.. మరో సీజన్‌లో నేల చూపులు చూడటం, పెట్టుబడులు అధికమై గిట్టుబాటు ధర రాలేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేయడం, పంటను పశువులకు మేతగా వదిలేయడం గతంలో జరిగేది. ఇకపై అలాంటి కష్టాలు ఉండవు. మార్కెట్లో ధరలు తగ్గినా.. రైతుకు కనీస గిట్టుబాటు ధర లభించేలా, సాధారణ సాగుకంటే అధిక దిగుబడులు వచ్చేలా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ టమాటా రకాలను పండించేలా ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అన్నమయ్య జిల్లాలో ప్రయోగాత్మకంగా నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల్లో రబీ సీజన్‌లో రైతులతో సాగుచేయించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. కోలార్, సీడ్ కాయగా రైతులు పిలుచుకునే ప్రాసెసింగ్ టమాటా రకాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై ప్రత్యేక కథనం..

- అన్నమయ్యజిల్లాలో అత్యధికంగా సాగయ్యే ఉద్యాన పంటల్లో టమాటా ఒకటి. జిల్లాలో సాధారణ పరిస్థితుల్లో రబీ సీజన్‌కు 12,500 ఎకరాలు టమాటా సాగవుతుంటే ప్రస్తుతం 3,950 ఎకరాల్లో సాగు చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 10 వరకు టమాటా విరివిగా సాగుచేస్తారు. సంబేపల్లె, సుండుపల్లె, చిన్నమండ్యం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో తక్కువ విస్తీర్ణంలోనూ, గుర్రంకొండ, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో అధికంగా సాగు చేస్తారు. బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం మండలాలు జిల్లాలోనే టమాటా అత్యధికంగా సాగుచేసే ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. ఈ నేపథ్యంలో రైతుకు అండగా నిలిచేందుకు, కనీస గిట్టుబాటు ధర పొందేందుకు ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్ట్(ఏపీఐఎల్ఐపీ) ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రాసెసింగ్‌కు అనువైన టమాటా రకాలపై రైతులకు అవగాహన కల్పించాలని, మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో ప్రయోగాత్మకంగా సాగుచేసేందుకు సంకల్పించింది. ప్రాసెసింగ్ టమాటా రకాలు కర్ణాటకలోని కోలార్, చింతామణి జిల్లాల్లో అక్కడి రైతులు అధికంగా సాగుచేస్తున్నారు. ఈ రకంలో విత్తనాలు తక్కువగా, కండశాతం ఎక్కువగా ఉండటం వల్ల జ్యూస్, సాస్ తయారీకి అనుకూలంగా ఉంటాయి. సాధారణ వాడకానికి ఉపయోగపడుతాయి. దీనిని అక్కడి రైతులు వాడుకభాషలో కోలార్ కాయ, సీడ్‌కాయ, జ్యూస్‌కాయగా పిలుస్తుంటారు. సాధారణ టమాటా రకాలతో పోలిస్తే దాదాపు 25శాతం అధిక దిగుబడులు, ఎక్కువ కాలం మన్నిక, మంచి రంగు, సైజు దీని ప్రత్యేకత.

ప్రయోగాత్మకంగా సాగు..

మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో ప్రాసెసింగ్ టమాటా ప్రయోగాత్మక సాగుకు ఉద్యానశాఖ అధికారులు 185 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకుంటే 65 ఎకరాల్లో సాగుచేసేందుకు రైతులు ముందుకొచ్చారు. ఈ రకం సాగుచేసినందుకు రైతుకు పెట్టుబడి రాయితీగా ఒక ఎకరాకు రూ.21,400 సబ్సిడీ ఇస్తారు. కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రాసెసింగ్ రకాలైన సింజంటా–6242, అన్‌సోల్, జివెల్ రకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులకు ఒక మొక్క విలువ రూ.1.25పైసలు అయితే ప్రభుత్వ సబ్సిడీ రూ.1 పోనూ 0.25 పైసలకు సరఫరా చేస్తున్నారు.మల్చింగ్ పేపర్‌కు రూ.6,400, ఐపీఎం కింద ఎకరాకు రూ.2,000, కాయలు వచ్చాక మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా ఒకొక్కటి రూ.120 చొప్పున ఎకరాకు 40 ప్లాస్టిక్ క్రేట్ల వరకు రాయితీపై అందిస్తున్నారు. ఒక ఎకరాకు 8,000 మొక్కలు అవసరమవుతాయి. వీటిలో జివెల్ రకానికి అధికంగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఈ రకాలను కోలార్, చింతామణి మార్కెట్లలో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అక్కడికి తరలించేందుకు వీలుగా ప్లాస్టిక్ క్రేట్లను రైతులకు రాయితీపై అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.

దిగుబడులు అధికంగా వస్తాయి....



ప్రాసెసింగ్ టమాటా రకాలు సాధారణ పంటతో పోలిస్తే అధిక దిగుబడులు వస్తాయి. గత ఏడాది సీజన్‌లో వీటిని ప్రత్యేకంగా కోలార్ నుంచి తెప్పించి ఎకరా భూమిలో సాగుచేశాను. రూ.2లక్షల వరకు పెట్టుబడి ఖర్చు వచ్చింది. సుమారు 2,500 బాక్సుల(ఒకొక్కటి 30కిలోలు) కాయ వచ్చింది. కోలార్ మార్కెట్‌కు తీసుకెళితే కిలో రూ.25 నుంచి 45 వరకు ధర పలికింది. పెట్టిన పెట్టుబడికి మూడురెట్లకు పైగా ఆదాయాన్ని పొందగలిగాను. ప్రస్తుతం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాయితీపై సాగుచేసేందుకు ప్రోత్సాహకాలు అందించడం సంతోషంగా ఉంది.
– సుధాకర్‌రెడ్డి, మన్యంవారిపల్లె, నిమ్మనపల్లె మండలం

రైతుకు గిట్టుబాటు ధర....



టమాటాను సాగుచేసిన రైతు నష్టపోకూడదని, మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉన్నా గిట్టుబాటు ధర పొందాలనే ఉద్దేశంతో ప్రాసెసింగ్ రకాలను ప్రోత్సహిస్తున్నాం. మార్కెట్లో రేట్లు తగ్గినప్పుడు ప్రాసెసింగ్ టమాటాను కనీసధర రూ.4–6 కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుంది. పెట్టుబడి నష్టపోకుండా కొద్దిపాటి లాభాలతోనైనా రైతు ఊరటచెందే వీలుంటుంది. ఫిబ్రవరి 25 నుంచి నిమ్మనపల్లె, మదనపల్లె మండలంలో రైతులకు నారు సరఫరా చేస్తున్నాం.
– ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి, మదనపల్లె

నామినేషన్ వేసి టీడీపీ నాయకులు నవ్వుల పాలయ్యారు

- జిల్లాలో ఆ పార్టీకి మనుగడ లేదు
- లోకేష్‌కు సీఎం జగన్‌ను విమర్శించే అర్హత లేదు
- ఎన్టీఆర్ తర్వాత టీడీపీని చంద్రబాబు భ్రష్టు పట్టించారు
- వైఎస్సార్ కుటుంబాన్ని వీడి మాజీమంత్రి నామరూపాల్లేకుండా పోయారు
- స్థానిక సంస్థల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి




విలేకరులతో మాట్లాడుతున్న పి.రామసుబ్బారెడ్డి

కడప సిటీ : టీడీపీ నాయకులు కొంతమంది స్వతంత్ర్య అభ్యర్థితో నామినేషన్ వేయించి నవ్వుల పాలయ్యారని స్థానిక సంస్థల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం జమ్మలమడుగు వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే తమ పార్టీపై పోటీ చేయాలని, స్వతంత్ర్య అభ్యర్థితో నామినేషన్ దాఖలు చేయించి అమాయక ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ తుడుచుకుపోయిందని తెలిపారు. టీడీపీకి సంఖ్యాబలం లేకపోయినా నామినేషన్ వేయించి నవ్వుల పాలయ్యారన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో ఇండిపెండెంట్ అభ్యర్థికి దొంగ సంతకాలు పెట్టించారని, ఇది దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్టీఆర్ విలువలతో కూడిన టీడీపీని స్థాపిస్తే, చంద్రబాబు పార్టీని భ్రష్టు పట్టించారన్నారు. గతంలో 23 మంది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేను టీడీపీలోకి తీసుకుని మంత్రి పదవులు కూడా ఇచ్చారన్నారు. వైఎస్సార్ కుటుంబాన్ని వదిలాక ఆ మాజీమంత్రి నామరూపాల్లేకుండా పోయారని విమర్శించారు. ధైర్యంగా నామినేషన్ వేసే పరిస్థితి టీడీపీకి లేదని, దొంగ సంతకాలతో రూఢీ అయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 120 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ తన తండ్రి వైఎస్సార్ ఆశయాల సాధన కోసం వ్యతిరేకించి పది సంవత్సరాలపాటు ప్రజల మధ్యనే గడిపారన్నారు. తర్వాత 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలు సాధించుకుని రికార్డు సృష్టించారని అన్నారు. అన్ని రంగాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇంతకంటే భారీ మెజార్టీ వస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. అలాంటి వ్యక్తిని పట్టుకుని లోకేష్ ప్యాలెస్ పిల్లి అని పదేపదే మాట్లాడే అర్హత లేదని తెలిపారు. పాదయాత్రకు జనం లేకపోవడంతో డీలా పడి ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని అన్నారు. పులిపులిగా, పిల్లి పిల్లిగానే ఉంటుందని గుర్తించుకోవాలన్నారు. తమకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యూస్‌రీల్

షోలాపూర్-తిరుపతి రైళ్ల గడువు పొడిగింపు



కడప కోటిరెడ్డిసర్కిల్: షోలాపూర్-తిరుపతి-షోలాపూర్ (01437/38) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ గడువును జూన్ 30వ తేదీ వరకు పొడిగించామని చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. ఈ రైలు ఈనెల 17వ తేదీ వరకు రాకపోకలకు గడువు ముగిసిందని, ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గడువును పొడిగించారని తెలిపారు. షోలాపూర్ జంక్షన్‌లో గురువారం రాత్రి 9.40 గంటలకు బయలుదేరి శుక్రవారం చేరుకుని, అదేరోజు రాత్రి 9.10 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం మీదుగా షోలాపూర్‌కు చేరుతుందని వివరించారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఇంటర్మీడియట్ ఆర్ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇంటర్మీడియట్ ఆర్ఐవో రమణరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలోనే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు రెండు దశల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14,541 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారన్నారు. ఇందులో ఎంపీసీకి సంబంధించి 9648 మంది, బైపీసీకి సంబంధించి 4893 మంది రాయనున్నారన్నారు. ఇందుకోసం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 101 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరగుతాయని చెప్పారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రాక్టికల్స్ మొదటి విడత ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు, రెండో విడత మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు సెలవు దినాల్లో కూడా జరుగుతాయన్నారు. ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమును కూడా ఏర్పాటు చేశామన్నారు. సమస్యలుంటే 08562 244171 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆర్ఐవో తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్. చిత్రంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ తమీమ్ అన్సారియా

రాయచోటి: ఎమ్మెల్యే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని పోలీస్, సెక్టోరల్ అధికారులకు కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి పోలీస్, సెక్టోరియల్ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించాలన్నారు. ఓటర్లపై అధికంగా ప్రభావం చూపే సమస్యాత్మక ప్రాంతాలను పోలీసుల సహకారంతో గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల విధుల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

పటిష్టమైన బందోబస్తు: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు, డీఎస్పీలు, పోలీస్, సెక్టోరియల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలుపరిచి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్యామిలీ డాక్టర్, అనీమియా తదితర అంశాలపై మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటే వైద్యసేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలుచేస్తోందని కలెక్టర్ అన్నారు. డాక్టర్లు ఇంటి దగ్గరకు వెళ్లి రోగులకు వైద్యసేవలు అందిస్తే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు అనీమియా బారినపడకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కంటి వెలుగు స్క్రీనింగ్ పక్కాగా జరగాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడికి ఘనస్వాగతం



ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు భాస్కర్ కాటమనేనితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ

రాయచోటి: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి భాస్కర్ కాటమనేనికి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో ఘనస్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం రాయచోటికి చేరుకున్న ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ ఎన్నికల పరిశీలకుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు భాస్కర్ కాటమనేని జిల్లా అధికారులకు సూచించారు.

పరిహారం.. దరహాసం

- స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ



స్టీల్‌ప్లాంట్ నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

జమ్మలమడుగు: ఉక్కు నగరానికి బీజం పడింది. 16 ఏళ్ల నాటి కల సాకారం దిశగా అడుగులు పడ్డాయి. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ గ్రూప్ సారథ్యంలో ఈ నెల 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిందాల్ కంపెనీ ఎండీ సజ్జన్ జిందాల్ చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించడానికి శ్రీకారం చుట్టారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పంపిణీ జరిగింది. దీంతో భూనిర్వాసితుల మోములో దరహాసం తొణికిసలాడుతోంది. ఇప్పటికే రెండు ఎకరాల భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించారు. ఎకరా భూమి కోల్పోయిన రైతుల ఖాతాల్లో సైతం డబ్బులు జమ అయ్యాయి. స్టీల్ ప్లాంట్ కోసం పూర్తిగా భూములు కోల్పోయిన వారి వివరాలను సేకరిస్తున్నారు.

2019 డిసెంబర్‌లో శంకుస్థాపన..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తామని ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారం వచ్చిన ఆరునెలల్లోనే జమ్మలమడుగు మండలం కన్యతీర్థం వద్ద 2019 డిసెంబర్ 23వతేదీన శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. వెంటనే 3148 ఎకరాలు, మరో 409 ఎకరాల డీకేటీ భూమిని కేటాయించారు. వైఎస్సార్‌స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం డీకేటీ భూములు కోల్పోయిన 178 మంది రైతుల వద్ద నుంచి 391.44 ఎకరాల భూమిని సేకరించారు. ఎకరాకు 7.5 లక్షల వంతున 29కోట్ల 35 లక్షల రూ.80వేలు రైతుల ఖాతాల్లో గతేడాది సెప్టెంబర్‌లోనే జమ చేశారు.దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదంతో మరి కొందరికి...

మండలంలోని రైతులకు 7వ అసైన్డ్ కమిటీలో భూములు కేటాయించారు. అయితే వారికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. తమకు కూడా పరిహారం ఇప్పించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డిల వద్ద మొరపెట్టుకున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దీంతో లబ్ధిదారులకు సైతం పరిహారం అందించేందుకు కెబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. పట్టాలు లేకపోవడంతో వారికి 50శాతంతో పరిహారం అందించాలని నిర్ణయించింది. ప్రతి రైతుకు 3.75లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. 7వ విడతలో 379 మంది రైతులకు 3.75 లక్షల వంతున రూ. 14కోట్ల,56లక్షల 46వేల పరిహారం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే 250 మందికిపైగా ఎకరా భూమి ఉన్న రైతుల ఖాతాల్లో 3.75 లక్షల వంతున డబ్బులు జమ అయ్యాయి.

26న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

పోరుమామిళ్ల: వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 26న పోరుమామిళ్లలోని సిరి ఫంక్షన్ హాలులో తైక్వాండో పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి నాయబ్‌రసూల్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

వైవీయూ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉన్నతవిద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. బాబు పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో రసాయనశాస్త్రశాఖ, ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ సహకారంతో 'పొల్యూషన్ కంట్రోల్ అండ్ సస్టెయినబుల్ ఎన్విరాన్‌మెంట్' అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ కాలుష్య సమస్యకు ఇలాంటి సదస్సులు పరిష్కారం చూపాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యానికి మనందరం బాధ్యులమేనన్నారు. అదే విధంగా కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన తిరుపతి ఐఐటీ కెమిస్ట్రీశాఖ అధ్యాపకులు డాక్టర్ కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధునాతన విధానాల గురించి వివరించారు.

వైభవం..పార్వేట ఉత్సవం



పారువేటకు బయలుదేరుతున్న శ్రీ వీరభద్రస్వామి

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు అశ్వవాహనంపై పారువేటకు వెళ్లారు. శుక్రవారం ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంలో కొలువుదీర్చారు. పారువేటలో భాగంగా స్వామి వారు ఆలయ మాడవీధులలో ఊరేగారు. రవిహాల్ వెనుక భాగాన ఉన్న నాలుగు కాళ్ల మండపం వద్ద సంప్రదాయంగా కుందేలు విడిచి స్వామి వారు వేటాడినట్లుగా సంప్రదాయాన్ని పూర్తి చేస్తారు.

- పార్వేట ఉత్సవానికి స్థానిక భక్తులు, కన్నడ భక్తులు తరలి వచ్చారు. అంతకు ముందు ఆలయంలో వేదపండితులు రాచరాయ యోగీ స్వామి, కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి ఆధ్వర్యంలో మహా సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

క్లుప్తంగా

పాముకాటుతో అస్వస్థత

మదనపల్లె : పాము కాటుకు గురై ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. స్థానికంగా నివాసం ఉన్న టి.గంగన్న కుమారుడు టి.రామచంద్ర (44) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం దుస్తులు ఉతకడానికి పొలం వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకుని జొన్న పొలంలో వస్తుండగా, పాము కాటు వేసింది. దీంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

– పూరిపాక దగ్ధం

మదనపల్లె : అగ్ని ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడి, పూరిపాక దగ్ధమైన సంఘటన శుక్రవారం రాత్రి బి.కొత్తకోట మండలంలో జరిగింది. గట్టు పంచాయతీ తులసిమానుపెంట గ్రామానికి చెందిన మనోహర్(25), సుగుణ(20), భార్యాభర్తలు. మనోహర్ పెయింట్ పనులు చేస్తుండగా, సుగుణ కూలీ పనులకు వెళ్తూ జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి 7:30 గంటల సమయంలో పూరి పాకలో వంట పనిలో భాగంగా, పెయింట్ కడుక్కునేందుకు వాడే టర్పెంట్ ఆయిల్ వేసి పొయ్యి వెలిగించేందుకు సుగుణ ప్రయత్నించింది. పొయ్యిలో వెలిగిన మంటలు.. పక్కనే సమీపంలో ఉన్న టర్పెంట్ ఆయిల్ ఉంచిన క్యాన్ పొరపాటున కిందపడి పోయి ఉండడంతో అంటుకున్నాయి. ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. పూరిపాక పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో మనోహర్ స్వల్పంగా, సుగుణ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఎంత పని చేశావ్.. అమ్మా!

- కుమార్తెకు నిప్పంటించి, తానూ ఆత్మహత్యాయత్నం
- నెలల పాప మృతి
- తల్లి పరిస్థితి విషమం



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయిషా



చిన్నారి అలీషా (ఫైల్)



ఆయిషా (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : వారిది చిన్న కుటుంబం.. భార్యాభర్తలు పని చేసుకొని జీవనం సాగించేవారు. ఏడాది వయస్సు గల పాపతో వారు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. సంతోషాలకు నిలయమైన ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కుమార్తెను చంకనెత్తుకున్న ఆ తల్లి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. ఈ సంఘటన ప్రొద్దుటూరులోని మోడంపల్లెలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. నాసిర్ మైదుకూరు రోడ్డులోని ఒక సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. అతనికి రెండేళ్ల క్రితం అనంతపురానికి చెందిన ఆయిషాతో వివాహం అయింది. వారికి 13 నెలల అలీషా అనే కుమార్తె ఉంది. పెళ్లి అయిన నాటి నుంచి భార్యా భర్తలు అన్యోన్యంగా ఉండేవారు. ఈ క్రమంలో గురువారం రాత్రి నసీర్ సూపర్ మార్కెట్ నుంచి ఇంటికి వచ్చాడు. భోజనం తిన్న తర్వాత భార్యాభర్తలు పడుకున్నారు. కొంత సేపటి తర్వాత ఆయిషా తన కుమార్తెను ఎత్తుకొని మొదటి అంతస్తునున్న గదిలోకి వెళ్లింది. అక్కడే ఉన్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి మంటలు రావడంతో భర్త గట్టిగా కేకలు వేశాడు. స్థానికుల సహకారంతో భార్యా, కుమార్తెలను జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యుడు వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. అయితే కొద్ది సేపటి తర్వాత అలీషా (13 నెలలు) మృతి చెందింది. ఆయిషా శరీరం కూడా పూర్తిగా కాలిపోయింది. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సంఘటన జరిగిన వెంటనే భర్త నాసిర్‌ను టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనపై అతన్ని ప్రశ్నించారు. తన భార్య ఎందుకు ఇలా చేసిందో తెలియదని చెబుతున్నాడు. తమకు ఎలాంటి సమస్యలు లేవని, గొడవలు కూడా తమ మధ్య ఉండేవి కావని అతను పోలీసులకు తెలిపాడు. కాగా పోలీసులు నాసిర్ నివాసం ఉంటున్న మోడంపల్లెకు వెళ్లి విచారించారు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారని చెప్పారు. నాసిర్‌ను చాలా ఏళ్ల చూస్తున్నామని, మంచి వ్యక్తి అని వారు పోలీసులతో అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయిషా తన భర్త దేవుడు లాంటి వాడని పోలీసులకు తెలిపింది. తనను ఏమీ అనొద్దని, అతను మంచివాడని చెప్పింది. అనంతపురంలో ఉన్న ఆయిషా తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటన ఎందుకు జరిగిందో అర్థం కాక పోలీసులు సతమతమవుతున్నారు. టూ టౌన్ సీఐ ఇబ్రహీం శుక్రవారం ఉదయం రిమ్స్‌కు వెళ్లి పరిశీలించారు.

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. చౌడేపల్లె మండలం యానాదిపాళెంకు చెందిన పెద్దబ్బ భార్య వసంత(35) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. భర్త కుటుంబాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపడంతో శుక్రవారం గొడవ పడింది. మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కురబలకోట మండలం ముదివేడు క్రాస్‌కు చెందిన విశ్వనాథరెడ్డి(35) ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యం భరించలేక..

నిమ్మనపల్లె : అనారోగ్యం భరించలేక రైతు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. నాయునివారిపల్లెకు చెందిన జయచంద్ర(36) వ్యవసాయం చేసుకుని జీవించేవాడు. ఈక్రమంలో ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. పలు ఆస్పత్రిలలో చికిత్స పొందాడు. ఆరోగ్యం మెరుగవకపోవడంతో జీవితంపై విరక్తితో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల చికిత్సల అనంతరం బాధితుడు కోలుకుంటున్నాడు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



దుంగలతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం గాదెల అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్ఆర్‌వో రఘునాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గాదెల సమీపంలోని శేషాచలం అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. వారిని చూసి కొందరు ఎర్రచందనం దుంగలను వదిలేసి, పరారయ్యారు. అక్కడున్న 6 ఎర్రచందనం దుంగలను అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్ఆర్‌వో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో మహేష్‌కుమార్, ఎఫ్‌బీవో దేవేంద్రరెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణి మాంసం కొనుగోలుదారుడికి జరిమానా

నిమ్మనపల్లె : వన్యప్రాణి మాంసం కొన్న వ్యక్తికి రూ.30 వేల జరిమానా విధించినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దీప తెలిపారు. మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో వన్యప్రాణుల మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం ఫారెస్ట్ అధికారులతో కలిసి గ్రామంలో విచారణ చేశారు. అధికారుల రాకను గుర్తించి మాంసపు విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తి పరారయ్యారు. కొనుగోలు చేసిన అగ్రహారం గ్రామానికి చెందిన రమేష్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రెండు కిలోల మాంసం స్వాధీనం చేసుకున్నారు. నిర్ధారణ కోసం మాంసాన్ని ల్యాబ్‌కు పంపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం అమల్లో భాగంగా మాంసం కొనుగోలు చేసినందుకు రమేష్‌పై రూ.30 వేల జరిమానా విధించి అటవీ శాఖ ద్వారా ప్రభుత్వానికి జమ చేశారు. మాంసం విక్రయించిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని బీట్ ఆఫీసర్ పేర్కొన్నారు.

కొండకు ఆకతాయిలు నిప్పు



మంటలను అదుపు చేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్‌లోని మద్దూరు, సిద్దవటం బీట్ల పరిసర ప్రాంతాల్లో కొండకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. చెట్లు, వన్యప్రాణులు చనిపోకుండా కాపాడే యత్నం చేశారు. శుక్రవారం రాత్రి వరకు మంటలు కొనసాగాయి. శనివారం కూడా వెళ్తామని రేంజర్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు, అసిస్టెంటు బీటు అధికారులు, ప్రొటెక్షన్ వాచర్‌లు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం



కాలిపోయిన మామిడి చెట్లను పరిశీలిసుతన్న రెవెన్యూ సిబ్బంది

సంబేపల్లె : మండలంలోని గురిగింజకుంట పంచాయతీ దిన్నెపల్లెకు చెందిన నారాయణరెడ్డి అనే రైతు మామిడి తోట దగ్ధమైంది. నారాయణరెడ్డి సర్వే నంబర్ 448–2లో 5 ఎకరాల్లో మామిడి తోట సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి తోటకు నిప్పంటించారు. ఎకరాన్నరలోని 85 మామిడి చెట్లు, 20 టేకు చెట్లు, డ్రిప్ వైరు 30 కట్టలు కాలిపోయాయి. బాధితుడు శుక్రవారం సంబేపల్లె పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నష్టం అంచనా వేస్తున్నట్లు వారు తెలిపారు.

కంచెకు నిప్పు..

ఓబులవారిపల్లె : మండల పరిధి గాడివారిపల్లె సమీపంలోని తోట కంచెకు నిప్పు అంటుకోవడంతో 7 ఎకరాల్లో అరటి, మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. గురువారం సాయంత్రం కంచెకు ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి తోటలకు వ్యాపించాయి. గ్రామంలోని వీసీ వెంకటసుబ్బారెడ్డికి చెందిన 3.5 ఎకరాలు, వీసీ రామసుబ్బారెడ్డికి చెందిన 3.5 ఎకరాలు, ముక్కా యల్లారెడ్డి నాగమణెమ్మకు చెందిన 1.54 ఎకరాల్లో తోటలు కాలిపోయాయి. దాదాపు వెయ్యి అరటి, యాభై మామిడి చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

- శుభాకాంక్షలు





విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్.అబ్దుల్ నజీర్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి తీవ్ర గాయాలు



పెద్దమండ్యం : గాయపడిన అక్కులప్ప, వెంకటప్ప, వెంకటరమణ

మదనపల్లె : వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దమండ్యం మండలం బండమీదపల్లెకు చెందిన మల్లికార్జున(38), రమణమ్మ(33) దంపతులు శుక్రవారం సొంత పనులపై ద్విచక్ర వాహనంలో పెద్దమండ్యంకు వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా దారిలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

- పీటీఎం మండలం కాట్నగల్లుకు చెందిన చెన్నకేశవులు(50) ప్యాసింజర్ ఆటోలో మదనపల్లెకు వస్తూ, దారిలో పట్టుతప్పి కిందపడ్డాడు. ఆయన తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న పాల వాహనం

పెద్దమండ్యం : ద్విచక్ర వాహనాన్ని పాల వాహనం ఢీకొనడంతో ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దమండ్యం మండలంలో జరిగింది. పాపేపల్లి పంచాయతీ వెలిగింటివారిపల్లెకు చెందిన ఓ.అక్కులప్ప(52), ఎం.వెంకటయ్య(60), ఆర్.వెంకటరమణ(50) భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పనుల అనంతరం ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంలో పాపేపల్లెకు బయలుదేరారు. మార్గం మధ్యలో పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్ వద్ద ఎదురుగా వచ్చిన జెర్సీ ప్రైవేట్ డెయిరీ పాల వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో అక్కులప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

మదనపల్లె : ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పరారీలో ఉన్న అంతర్ రాష్ట్ర దొంగను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని కెల్లాంబపురానికి చెందిన సురేష్(25), బుచ్చినాయుడికండ్రిగ మండలం తంగేడుపాళెం గ్రామానికి చెందిన కాళీముత్తు(28)లు ద్విచక్రవాహనాలను చోరీ చేసే వారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద నిలిపి ఉంచిన వాహనాల చోరీకి పాల్పడే వారు. ఈక్రమంలో వాహన తనిఖీల్లో భాగంగా జనవరి 31న సురేష్‌ను అరెస్ట్ చేసి అతని నుంచి ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈకేసులో పరారీలో ఉన్న కాళీముత్తును శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితులపై తమిళనాడు, అనంతపురం జిల్లా గోరంట, మదనపల్లెలో వాహన చోరీ కేసులు ఉన్నాయి. సమావేశంలో ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప లోని డీఎస్ఏ క్రీడామైదానంలో శుక్రవారం హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి జూనియర్ బాలుర విభాగం (అండర్–19) ఎంపికలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంభం చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ఎ. సింధూరి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 3, 4, 5 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.గౌరవ అతిథిగా విచ్చేసిన పోతుల ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి , జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్. సమరనాథరెడ్డి, జియోన్ వ్యాయామ కళాశాల వ్యవస్థాపకులు కె. రాజారత్నం ఐజాక్ మాట్లాడారు. డీఎస్ఏ హ్యాండ్‌బాల్ కోచ్ మునాఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రాజశేఖర్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, శివప్రసాద్, రాజగోపాల్‌రెడ్డిలు సెలక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా జట్టుకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు.

జిల్లా ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు..

చాంద్‌బాషా, ప్రతాప్, ఉదయ్‌కుమార్, విక్రమ్ కల్యాణ్, వెంకటశివకుమార్, వెంకటకృష్ణారెడ్డి, ఈశ్వర్, గురువర్ధన్, నాగేంద్ర, రజాక్, సునీల్‌రెడ్డి, ఆదర్శ్, సాయికిరణ్, విజయరాజ్, మోహన్‌నాయక్, ఆదిశేషారెడ్డి, విష్ణువర్ధన్, అబ్దుల్ రహీం, అక్బర్, ప్రసాద్, మురళీకృష్ణా, వెంకటశ్రీరామ్.

దేవదాయ భూముల లెక్క పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ

కడప కల్చరల్ : జిల్లాలోని దేవదాయ భూముల విషయంలో సర్వే లెక్కలు పక్కాగా ఉండాలని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.శంకర్ బాలాజీ అన్నారు. శుక్రవారం కడపలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన తనిఖీ అధికారులు, మండల కార్యనిర్వహణాధికారులు, కో ఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 మండలాల్లో దేవదాయశాఖ భూములు సుమారు 14,596.53 ఎకరాలు ఉన్నాయన్నారు. భూ సర్వేలో భాగంగా మండల కార్యనిర్వాహణ అధికారులు, మండల కో ఆర్డినేటర్లు దేవాలయాలకు సంబంధించిన అన్ని భూముల వివరాలు సంబంధిత మండల తహసీల్దార్‌కు ఫారం–ఏ ద్వారా అందజేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దేవదాయశాఖకు సంబంధించిన భూముల విషయంలో అన్ని మండలాల తహసీల్దార్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కనుక జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్యనిర్వాహణ అధికారులు సంబంధిత మండల తహసీల్దార్లకు ఫారం–ఏ రూపంలో జిల్లాలోని దేవదాయశాఖకు చెందిన అన్ని భూములు, తగిన రికార్డులు అందజేయాలన్నారు.

ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన

మగబిడ్డను ప్రసవించి మహిళా పోలీసు మృతి



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు (ఇన్‌సెట్) స్వర్ణకుమారి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే కుమారుడిని చూడకనే కన్నుమూసింది. మహిళా పోలీసు స్వర్ణకుమారి (33) ఆస్పత్రిలో మగబిడ్డను ప్రసవించి కొద్ది సేపటి తర్వాత మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధితులు, ఆస్పత్రి వర్గాలు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన బాబు చేనేత పని చేసుకొని జీవనం సాగించేవాడు. ఆయన భార్య స్వర్ణకుమారికి 2019లో కొండాపురం మండలంలోని చౌటపల్లె సచివాలయంలో మహిళా పోలీసుగా ఉద్యోగం వచ్చింది. దీంతో వారు కొండాపురం మండలానికి కాపురం మార్చారు. వారికి మొదటి కాన్పులో మగబిడ్డ జన్మించాడు. రెండో కాన్పు కోసం గురువారం ప్రొద్దుటూరులోని కాత్యా నర్సింగ్ హోంకు తీసుకెళ్లారు. డాక్టర్ సిజేరియన్ చేశాడు. మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆపరేషన్ తర్వాత ఆమెకు అధిక రక్తస్రావం జరిగింది. ముగ్గురు వైద్యులు కలిసి చికిత్స చేయడంతో రక్తస్రావం ఆగింది. కొద్ది సేపటి తర్వాత రెండో సారి బ్లీడింగ్(రక్తస్రావం) కావడంతో ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. రెండు ఆపరేషన్ల కోసం సుమారు ఏడు యూనిట్ల రక్తాన్ని ఎక్కించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. మూడో సారి రక్తస్రావమైతే ప్రమాదకరమని భావించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లాలని సూచించారు. గురువారం రాత్రి బెంగళూరుకు వెళ్తున్న సమయంలో పులివెందుల సమీపంలోకి వెళ్లగానే మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి తీసుకొచ్చారు. స్వర్ణకుమారి బంధువులు శుక్రవారం ఉదయం ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే ఆమె మృతి చెందిందని ఆరోపించారు. విషయం తెలియడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

మా నిర్లక్ష్యం లేదు

స్వర్ణకుమారి ఏడవ నెల వరకు వేరే ఆస్పత్రిలో చూపించుకున్నట్లు డాక్టర్ కాత్యా తెలిపారు. ఎనిమిదవ నెలలో తమ ఆస్పత్రికి వచ్చిన ఆమెను పరీక్షించగా మాయ కిందికి ఉండటంతో రిస్క్ ఎక్కువగా ఉంటుందని ముందే తెలిపామన్నారు. సిజేరియన్ చేసిన తర్వాత అధిక రక్తస్రావం కావడంతో, రెండో సారి ముగ్గురు వైద్యులు ఆపరేషన్ చేసి గర్భసంచిని తొలగించామన్నారు. మూడోసారి బ్లీడింగ్ అయితే ప్రమాదకరమని భావించి ముందు జాగ్రత్తగా బెంగళూరుకు వెళ్లాలని సూచించామని తెలిపారు. అక్కడికి వెళ్తున్న సమయంలో మార్గంమధ్యలో గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని, అన్ని జాగ్రత్తలు తీసుకునే ఆపరేషన్ చేశామని వివరించారు.

మా బిడ్డను పొట్టన పెట్టుకున్నారు..!

- ఆస్పత్రి వర్గాలతో ఘర్షణకు దిగిన బాధితులు
- మదనపల్లెలో చంటి బిడ్డ మృతి



మదనపల్లె : మా బిడ్డను పొట్టన పెట్టుకున్నారని బాధితులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వర్గాలతో శుక్రవారం ఘర్షణకు దిగారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన వెంకటేష్ భార్య లోకేశ్వరి మూడు నెలల కిందట జిల్లా ఆస్పత్రిలో మొదటి కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారి ఐదు రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం ఒక్కసారిగా ఊపిరాడకపోగా పరిస్థితి విషమంగా మారడంతో ఇంజెక్షన్ చేశారు. అయినా ఎలాంటి మార్పు రాకపోగా, మరింత విషమించడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇక్కడి వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. దీంతో ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలతో బాధితులు ఘర్షణకు దిగారు. చికిత్సలో తమ తప్పు లేదని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో.. చేసేదిలేక విషణ్ణవదనంతో బిడ్డను తీసుకుని ఇంటికెళ్లిపోయారు.